క్లుప్తంగా

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



వీపనగండ్ల: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల మత్స్యకారుల సొసైటీకి నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ నూతన అధ్యక్షుడిగా మిద్దె శ్రీనివాసులు (వీపనగండ్ల), ప్రధాన కార్యదర్శిగా సంగనమోని రాములు (సంగినేనిపల్లి) తో పాటు మరో ఏడుగురిని సొసైటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ఆత్మకూర్: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను బిగించుకోవడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోట్లంపల్లిలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలని, విరాళాలు సేకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు బీచుపల్లి, రోశయ్య, సిబ్బంది బాల్‌రాజు, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది 'మాస్‌లైన్'



అమరచింత: నిరంతరం సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాడేది సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ మాత్రమే అని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సూర్యం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో సీపీఎం నుంచి మహంకాళి ప్రభాకర్ మాస్‌లైన్ పార్టీలో చేరడంతో ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా సూర్యం మాట్లాడుతూ కార్మిక, కర్షక, బీడీ కార్మిక సమస్యలతో పాటు ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుంటామన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వారిని నమ్మవద్దని, ప్రజల కోసం పనిచేస్తున్న సంఘాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు హనుమంతు, ప్రసాద్, రాజన్న, రాజు, సామేలు, కుర్మన్న, ప్రేమరత్నం, జిలాని పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి



కొత్తకోట రూరల్: ప్రభుత్వం రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నా.. కొనుగోళ్లు చేయడం లేదంటూ ఉమ్మడి జిల్లా సీడీసీ మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లను కలిసి విన్నవించారు. శుక్రవారం కొత్తకోట సమీపంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన అదనపు కలెక్టర్‌ను సీడీసీ మాజీ చైర్మన్ రైతులతో కలిసి వెళ్లి కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. వరికోతలు ప్రారంభమై 15రోజులు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం ధాన్యం సేకరించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీరంగాపూర్ వాసికి డాక్టరేట్

శ్రీరంగాపూర్: మండల కేంద్రానికి చెందిన కె.హరికృష్ణ ఇంజినీరింగ్ విభాగం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. వరంగల్ జిల్లాలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.డేవిడ్‌సన్ పర్యవేక్షణలో రీసెర్చ్ చేసినట్లు హరికృష్ణ తెలిపారు. ప్రస్తుతం శ్రీవిష్ణు ఇంజినీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్ (అటానమస్) భీమవరంలో మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరి పరిశోధించి కనుగొని రాసిన సిద్ధాంతాలు అనేక జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించబడ్డాయి.

పక్కాగా సమగ్ర కుటుంబ సర్వే



పిన్నంచర్లలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న బీరం సుబ్బారెడ్డి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు పూర్తి వివరాలను నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్ పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలించారు. సర్వే గురించి గ్రామాల్లో దండోరా వేయించాలని నమోదు అనంతరం ఇళ్లకు స్టిక్కర్లు వేయాలన్నారు.

పాన్‌గల్: సమగ్ర ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండా..

నమోదు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నేటి వరకు 10,800 కుటుంబాల వివరాల నమోదు చేసి స్టిక్కర్లు అంటించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్ఐ మహేష్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే

వీపనగండ్ల: ప్రభుత్వ నిబంధనల మేరకు మండలంలో నిర్వహించనున్న సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రావు అన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 52 ఎన్యుమనేటర్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి వాటికి అవసరమైన సిబ్బందిని నియమించామని ఆయన అన్నారు. వీరిపై పర్యవేక్షణ కోసం ఆరుగురు సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీఓ శేఖర్‌గౌడ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె గ్రామాలను, వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తూంకుంట, సంపత్‌రావుపల్లి, నాగర్లబండతండాను, ఎంఈఓ నర్సింహులు బొల్లారం, కొర్లకుంట, వల్లాభాపురం, ఏఎస్ఓ మహేశ్వరి వీపనగండ్ల, వల్లాభాపురంతండా, ఏపీఎం బిచ్చన్న సంగినేనిపల్లి, పుల్గర్‌చర్ల గ్రామాలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

పెబ్బేరు రూరల్: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతుంది. ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుంచి వారికి కేటాయించిన గ్రామాల్లోకి వెళ్లి బ్లాక్‌ల వారీగా సర్వే చేస్తున్నారు.

దారులన్నీ కురుమూర్తి వైపే..



ఆత్మకూర్ నుంచి జాతరకు ఎద్దుల బండ్ల మీద వెళ్తున్న భక్తులు

ఆత్మకూర్: పేదల తిరుపతిగా కొలుస్తున్న కురుమూర్తిరాయుడి ఉద్దాల మహోత్సవాన్ని తిలకించేందుకు శుక్రవారం భక్తులు వేలాదిగా తరలివెళ్లారు. ఆత్మకూర్ మండలం నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో భక్తులు బయలుదేరారు. పచ్చి పులుసు, అన్నం నైవేద్యంగా స్వామివారికి సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

అమరచింత: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలను తిలకించేందుకు భక్తులు వివిధ గ్రామాల నుంచి అమరచింత మీదుగా కురుమూర్తికి వాహనాల్లో బయలు దేరడంతో దారులన్నీ కురుమూర్తికే అన్నట్లుగా కనిపించింది. మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, ఉట్కూర్,



అమరచింత నుంచి..

మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో తరలివెళ్లారు.

కల్వర్టు లేని చోట బ్రిడ్జి నిర్మాణమా?

వనపర్తి టౌన్: కల్వర్టు లేని చోట బ్రిడ్జి నిర్మాణం చేయడం ఏంటని బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మున్నూర్ రవీందర్ విస్మయం వ్యక్తం చేశారు. వనపర్తిలోని మర్రికుంట వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులను బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. కల్వర్టు ఉన్న చోట బ్రిడ్జి నిర్మాణం వదిలేసి నీళ్లు మళ్లేందుకు ఏ మాత్రం అవకాశం లేని చోట బ్రిడ్జి కట్టడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కనే డ్రైయినేజీ లేని చోట కల్వర్టులు కడితే మురుగు ఎక్కడికి ప్రవహించాలని ప్రశ్నించారు. ప్రజల మౌలిక వసతులకు అనుగుణంగా పనులు చేయాలని, ప్రజాధనం దుర్వినియోగం దిశగా అడుగులు వేయడంపై సరైంది కాదన్నారు. రోడ్డు దీనిపై ఆర్అండ్‌బీ అధికారు



బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలిస్తున్న రవీందర్

లను ఫోన్‌లో నిలదీయగా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపడుతున్నట్లు వివరించారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, నాయకులు రామన్నసాగర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వార్డుల్లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పర్యటించి అర్హులతో మాట్లాడారు. వెంటనే కొత్త పెన్షన్లు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో శేఖర్, యూనూస్, సమీర్ ఉన్నారు.



కోటిలింగాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠిస్తున్న కోటిలింగాల పూజలు ఏడు రోజులగా వైభవంగా కొనసాగుతున్నాయి. పదకొండు వేల శివలింగాలు ప్రతిష్ఠించే అపూర్వ కార్యక్రమం ఆలయంలో ఏర్పాటు చేయగా ఆదోని వీరశైవ అగమ పాఠశాల అధ్యాపకులు, అర్చకులు జగదీశ్వరస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో పూజలు చేశారు. రుద్రహోమం, పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో అభిషేకం చేయించారు. పూజ కార్యక్రమం అనంతనం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం



కోటిలింగాల ప్రతిష్ఠాపన హోమంలో పాల్గొన్న భక్తులు

చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్, జగదీశ్వర్, రాజేష్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు వనపర్తి విద్యార్థి

వనపర్తి విద్యావిభాగం: సంగారెడ్డి జిల్లాలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 హాకీ విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి హాకీ జట్టులో వనపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆర్.అనిల్‌కుమార్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి తెలిపారు. త్వరలో హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో అనిల్‌కుమార్ పాల్గొంటారని హెచ్ఎం పేర్కొన్నారు. దీంతో అనిల్‌కుమార్‌ను ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు



అనిల్‌కుమార్‌తో హెచ్ఎం తారాబాయి, ఫిజికల్ డైరెక్టర్లు

బి.కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాటతండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూల్యానాయక్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం వడ్డెవాటతండాకు చేరుకొని పూల్యానాయక్‌ను పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, గాడీల ప్రశాంత్, గుంత మల్లేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, త్యాగరాజు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జనంపల్లి మిద్దె మన్నెమ్మ (55) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు మృతురాలి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఇమాన్యుయేల్, బోయేజ్, శేఖర్, శ్యామ్‌కుమార్, కిరణ్, అనిల్‌కుమార్, దేవదానం, ప్రభాకర్, లూక, జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు భక్తరాజు,



వడ్డెవాటతండాలో పూల్యానాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి

మహిమరాజు, సతీష్‌రాజు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని హనుమాండ్ల గడ్డ కాలనీకి చెందిన పూసల రజిత ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి శుక్రవారం గోపాల్‌పేటలోని బాధిత ఇంటికి చేరుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రావు, లక్ష్మణ్, హోటల్ శ్రీను, శశికాంత్ యాదవ్, తోకల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల అభ్యున్నతికి కృషి

ఆత్మకూర్: స్వర్ణకారుల సహకార సంఘం ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా శృతి జ్యువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గాడి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా విష్ణు, నర్సింహ, కార్యదర్శులుగా మునీందర్, రాముడు, లక్ష్మణ్, సహాయకార్యదర్శులుగా చంద్రశేఖర్, కరుకొండ, రవి, రాజు, కోశాధికారులుగా జిన్నారం శ్రీను, లక్ష్మణ్‌తో పాటు 14 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అధ్యక్షుడు గాడి లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

వీపనగండ్ల: గోపల్‌దిన్నె గ్రామ సమీపంలో నిర్మించనున్న 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని ఆర్‌డీఓ సుబ్రమణ్యం శుక్రవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల పుల్గర్‌చర్ల, రంగవరం, గోపల్‌దిన్నె గ్రామాల రైతులకు, విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ సత్వర నిర్మాణం కోసం అవసరమయ్యే నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ రఘు, సర్వేయర్ శివ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలివ్వాలని రైతుల వినతి

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలు అందజేయాలని రంగవరం గ్రామానికి చెందిన రైతులు ఆర్‌డీఓ సుబ్రమణ్యానికి వినతిపత్రం అందజేశారు. గోపల్‌దిన్నె శివారులోని 357 సర్వే నెంబర్‌లో మూడు గ్రామాల రైతుల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు గతంలో జిల్లా స్థాయి అధికారులు వారం రోజులుగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారని, అర్హులై సాగులో ఉన్న రైతులకు వెంటనే పట్టాలు అందజేయాలని రైతులు బిచ్చన్నసాగర్, రాజశేఖర్, స్వామి, లక్ష్మీకాంతారెడ్డి, నర్సింహ, రాములు, కృష్ణయ్య, శాంతయ్య, శ్రీను విజ్ఞప్తి చేశారు.

ఓటరు నమోదు కార్యక్రమం

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుగుణ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శని, ఆదివారం రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు రెండు రోజుల పాటు అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. 2025 జనవరి 01 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునే యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహాసభలను జయప్రదం చేయాలి

వనపర్తి రూరల్: వీపనగండ్ల మండల కేంద్రంలో ఈ నెల 10 ,11 తేదీల్లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం వనపర్తి జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుట్టా ఆంజనేయులు కోరారు. ఆయన సీపీఎం వనపర్తి పట్టణ కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. 10న సాయంత్రం 4 గంటలకు సీపీఎం భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, సాగర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గోపాల్‌పేటలో వరికొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని మల్కిమియాన్‌పల్లి, తిరుమలాయపల్లి, కమాలోద్దీన్‌పూర్, వెంకటాంపల్లి, గట్టు కాడిపల్లి, షాపురం, మానాజీపేట, మల్కాపురం, సోళీపురం తదితర గ్రామాల్లో పీఏసీఎస్, మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులు చెప్పే మాయమాటలు నమ్మకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో వైస్‌చైర్మన్ క్యామరాజు, వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రాములు, బాలకృష్ణారెడ్డి, అంజనేయులు, రవినాయక్, ప్రభాకర్ రెడ్డి, బాషా, మహిళా సంఘం అధ్యక్షురాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వరికొనుగోలు కేంద్రాలను జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం గోపాల్‌పేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రఘు, టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు నాగశేషి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఆర్టీఐ చైర్మన్ కొంకి రమేష్, శేఖర్, మాజీ సర్పంచు శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



చిట్యాల గురుకుల పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

సాక్షి, నెట్‌వర్క్: సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో రోగులకు, పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, చిట్యాల గురుకుల పాఠశాలలో రాచాల యుగంధర్‌గౌడ్ కట్ చేసి సంబురాలు చేశారు. కార్యక్రమంలో శంకర్ ప్రసాద్, సతీష్, ప్రిన్సిపాల్ గురువయ్య గౌడ్, పాఠశాల కమిటీ చైర్మన్ రాజు, రాఘవేందర్‌గౌడ్, అంజన్నయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, డాక్టర్ పీజే బాబు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వెంకట్రాములుయాదవ్, సహదేవుడు, సింగల్‌విండో చైర్మన్ మురళీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, గంగాధర్‌గౌడ్, పరమేష్, శ్రీను, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలో ఉన్న భవనాన్ని కూల్చొద్దు



పుల్గర్‌చర్లలో అంగన్‌వాడీ భవనం

వీపనగండ్ల: పుల్గర్‌చర్ల అంగన్‌వాడీ సెంటర్ కోసం వినియోగిస్తున్న భవనాన్ని కూల్చేసి పంచాయతీ భవనాన్ని నిర్మించాలని చూస్తున్నారని, ఇది సరైంది కాదని బీఆర్ఎస్ నాయకుడు బాబురెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం మరమ్మతు కోసం గతంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి రిపేర్ చేయించామన్నారు. గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు నూతనంగా గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తామని శుక్రవారం అంగన్‌వాడీ సామగ్రిని మరో చోటుకు తరలిస్తున్నారని, ఈ విషయమైన గ్రామ ప్రజలను సమీకరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఎలాంటి అనుమతి తీసుకోలేదు

గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతున్న భవనాన్ని కూల్చేసి నూతన భవనాన్ని నిర్మిస్తామని పంచాయతీ కార్యాలయానికి ఎవరు దరఖాస్తు చేయలేదని పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్నారు. కూల్చివేస్తామన్న భవన నాణ్యత ప్రమాణాలను ఆర్అండ్‌బీ అధికారులు నిర్ధారిస్తారని, ఈ అంశం తమ పరిధిలో లేదని ఆయన వివరణ ఇచ్చారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని బాలకిష్టాపూర్ కస్తూర్బా పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షం ప్రకటించారు. మూడో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు రూ.1,330, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.1,540, కళాశాల విద్యార్థులకు రూ.2,100లు, బాలికలకు కాస్మోటిక్ చార్జీలు రూ.275 పెంచారని గతంలోకంటే 40 శాతం అధికంగా పెరిగాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, అఫ్రోజ్, జుబేర్, ఖాజ, మధు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూరం

పాన్‌గల్: పరిసరాల అపరిశుభ్రత, నీటి నిల్వలతో రోగాలు సంభవిస్తాయని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శాగాపూర్‌లో ఏఎన్ఎం సుమిత్ర ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీల్లో నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, ట్యాంకులు, డ్రమ్ముల్లోని నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. గ్రామంలో సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతుందని పలు కాలనీల ప్రజలు పేర్కొన్నట్లు ఆమె తెలిపారు. మురుగు నీటి నిల్వలో దోమల నివారణ మందును పిచికారీ చేశారు.

